# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :67 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 10-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## శ్రీలంకలో హెలికాప్టర్ ప్రమాదం.. ఆరుగురు మిలిటరీ సిబ్బంది మృతి

కొలంబో: శ్రీలంకలో సైనిక హెలికాప్టర్ కూలింది. ఓ రిజర్వాయర్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఆ ఘటనలో ఆరు మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మదురు ఓయా అనే సెంట్రల్ ప్రాంతంలో శ్రీలంక ఎయిర్ ఫోర్స్ దళానికి చెందిన బెల్ 212 హెలికాప్టర్ కూలినట్లు రక్షణశాఖ పేర్కొన్నది. ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్ బ్రిగేడ్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో ప్రదర్శనకు వెళ్తున్న సమయంలో ఈ హెలికాప్టర్ కూలినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతిచెందిన వారిలో ఇద్దరు ఎయిర్ ఫోర్స్, నలుగురు ప్రత్యేక దళ సైనికాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనపై విచారణ చేపట్టేందుకు 9 మంది సభ్యులతో శ్రీలంక వైమానిక దళం ఓ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది.

## భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు.. అమిత్ షా- అజిత్ దోవల్ కీలక భేటీ..



న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్‌తో భారత్- పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతుంది. దాయాది దేశం రెచ్చగొట్టే చర్యలకు ధీటుగా సమాధానం ఇచ్చేందుకు మోడీ సర్కార్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని వ్యవస్థల పని తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలోనే వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాజాగా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా.. డైరెక్టర్ జనరల్ ఆఫ్ బీఎస్ఎఫ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో సమావేశం అయ్యారు. సరిహద్దుల్లో, ఎయిర్ పోర్టుల్లో భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. కాగా, ఈ భేటీకి జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. కేంద్రమంత్రి ఇంట్లో ఈ కీలక సమావేశం జరిగింది. అయితే, చొరబాటు ఘటనలు జరుగుతున్న తరుణంలో పాకిస్తాన్ తో సరిహద్దు పంచుకుంటున్న ఆయా రాష్ట్రాలు ఇప్పటికే కీలక చర్యలు తీసుకుంటున్నాయి. భారతదేశంలోకి చొరబాటుకు ప్రయత్నించిన పాక్ కు చెందిన ఓ వ్యక్తిని పంజాబ్ సరిహద్దు దగ్గర బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) జవాన్లు హతమార్చారు. రాజస్థాన్‌లో 1,037 కిలోమీటర్లున్న పాక్ సరిహద్దును బంద్ చేశారు. ఎవరైనా సరిహద్దుల దగ్గర అనుమానాస్పదంగా కనిపిస్తే.. కాల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఇక, జమ్మూ కాశ్మీర్ లోని సాంబా జిల్లాలోని సరిహద్దు దాటి చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ గట్టిగా తిప్పికొట్టింది. ఈ దాడుల్లో సుమారు ఏడుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ నేడు కూడా ఎల్ఓసీకి ఆవలివైపు నుంచి భారీ స్థాయిలో కాల్పులు జరుపుతుంది. ముఖ్యంగా యూరి, జమ్మూకశ్మీర్ ప్రాంతాల్లో వీటి తీవ్రత భారీగా కనిపిస్తుంది. ఈ కాల్పుల్లో చాలా మంది ప్రజలు తమ ఇళ్లు ఖాళీ చేసి దూర ప్రాంతాలకు వెళ్తున్నారు.

## పాక్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాం : భారత సైన్యం

న్యూఢిల్లీ : ఈ నెల 8-9 మధ్య పాకిస్తాన్ సాయుధ దళాలు పశ్చిమ సరిహద్దుల్లో డ్రోన్లు, ఇతర ఆయుధాలతో చేసిన దాడులను సమర్థవంతంగా తొప్పికొట్టామని భారత సైన్యం శుక్రవారం వెల్లడించింది. జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంట పాక్ దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి.. భారీగా కాల్పులు జరుపుతున్నట్లు భారత సైన్యం ఎక్స్ వేదిక శుక్రవారం పేర్కొంది. దుష్ట కుట్రలకు బలంగా ప్రతిస్పందిస్తామని నొక్కి చెప్పింది. ఈ సందర్భంగా ఓ చిన్న వీడియో క్లిప్‌ను షేర్ చేసింది. 'ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ సాయుధ దళాలు మే 8-9 మధ్య రాత్రి పశ్చిమ సరిహద్దులో డ్రోన్లు, ఇతర ఆయుధాలను ఉపయోగించి దాఉడలకు ప్రారంభించాయి. జమ్మూ ఖశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ దళాలు ఉల్లంఘించాయి. డ్రోన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారు. కాల్పుల విరమణ ఉల్లంఘనకు తగిన సమాధానం ఇచ్చాం' అని భారత సైన్యం పేర్కొంది. భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడేందుకు కట్టుబడి ఉందని తెలిపింది. అన్ని దుష్ట కుట్రలకు బలంగా ప్రతిస్పందిస్తామని తెలిపింది. ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా బుధవారం తెల్లవారుజామున పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై భారత సాయుధ దళాలు మిస్సైల్స్‌తో దాడి చేశాయి. ఈ తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.



అయితే, భారత్‌లోని సైనిక స్థావరాలపై ఏదైనా దాడికి ప్రయత్నిస్తే అదే స్థాయిలో ప్రతిస్పందన ఉంటుందని రక్షణ మంత్రిత్వశాఖ గురువారం హెచ్చరించింది. జమ్మూ, పఠాన్‌కోట్, ఉధంపూర్‌లోని సైనిక స్థావరాలు, జమ్మూ కశ్మీర్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాకిస్తాన్ డ్రోన్‌లు, క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయని రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని, దాడులతో ఎలాంటి నష్టం జరుగలేదని తెలిపింది. భారత్ తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, తన ప్రజల భద్రతను నిర్ధారించడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని రక్షణ మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

హైదరాబాద్, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 42.00 కోట్లను ఫిక్స్ డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్ డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ. 22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ. 1,00,000/-తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ. 3000/- ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్




ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/- ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ. 8,98,39,000/-లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్.. తెలుగు జవాన్ వీరమరణం..



జమ్ము కశ్మీర్: భారత్-పాకిస్తాన్ యుద్ధంలో తెలుగు జవాన్ వీరమరణం పొందాడు.. జమ్మూ కాశ్మీర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళీ నాయక్ ప్రాణాలు విడిచారు.. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు జవాన్ మురళీ నాయక్.. ఆయన స్వస్థలం ఏపీలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండా.. రేపు కళ్లి తండాకు మురళీ నాయక్ పార్థివదేహాన్ని తరలించేందుకు భారత ఆర్మీ ఏర్పాట్లు చేసింది.. గోరంట్ల మండలం కళ్లితాండ గ్రామానికి చెందిన జ్యోతిబాయి, శ్రీరాముల నాయక్‌కు ఏకైక సంతానం మురళీ నాయక్.. సోమందేపల్లిలోని విజ్ఞాన్ స్కూల్ విద్యా వ్యాసం చేసిన ఆయన.. 2022లో ఇండియన్ ఆర్మీలో చేరాడు.. నాసిక్‌లో ట్రైనింగ్ పొంది, జమ్మూ కాశ్మీర్‌లో విధులు నిర్వహించి తిరిగి పంజాబ్ కు ట్రాన్సఫర్ అయ్యాడు.. పంజాబ్‌లో పనిచేస్తుండగా.. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో.. రెండు రోజుల క్రితం పంజాబ్ నుండి జమ్మూకు విధుల నిమిత్తం వెళ్లాడు.. కానీ, పాక్ కాల్పుల్లో వీరమరణం పొందాడు.. ఇక, వీర జవాన్ మురళీ నాయక్ మరణవార్త విని గుండెలవిసేలా రోదిస్తున్నారు ఆయన కుటుంబ సభ్యులు.. వీరజవాన్ మురళీ నాయక్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.. మురళీ నాయక్ మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసనసభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. అంటూ ట్వీట్ చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు మంత్రి నారా లోకేష్.. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డంతాండ పంచాయతీ కళ్లి తాండా గ్రామానికి చెందిన మురళి నాయక్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం.. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని ప్రకటించారు నారా లోకేష్.. ఇక, జమ్ముకశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్ వీరమరణంపై మాజీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.. మురళీనాయక్ స్వస్థలం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం కళ్లి తండా.. దేశభద్రతలో తన ప్రాణాలను ఫణంగా పెట్టి వీరమరణం పొందిన మురళీనాయక్ త్యాగాన్ని మరువలేమన్న జగన్.. మురళీనాయక్ కుటంబీకులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.. పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు మురళీనాయక్ మృతికి సంతాపం ప్రకటించారు..

## ఎమ్మెల్యే పదవిని కోల్పోయిన గాలి జనార్ధన్ రెడ్డి..



బెంగళూర్ : కర్ణాటకలో రాజకీయ దుమారం రేపిన అక్రమ ఓబుళాపురం రవాణా మైనింగ్ కేసులో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డికి శిక్ష పడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించడంతో పాటు, రూ. 10,000 జరిమానా కూడా విధించింది. ఈ తీర్పుతో పాటు తాజాగా కర్ణాటక అసెంబ్లీ నుండి ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ అధికారిక నోటిఫికేషన్ విడుదలైంది. మే 6, 2025న శిక్ష ఖరారైన నేపథ్యంలో భారత రాజ్యాంగం 191(1)(e), ప్రజా ప్రతినిధుల చట్టం 1951 ప్రకారం ఆయన అసెంబ్లీ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించబడ్డారు. కర్ణాటక అసెంబ్లీ విడుదల చేసిన ప్రకటనలో, ఆయన గంగావతి నియోజకవర్గానికి ఇకపై ఎమ్మెల్యేగా కొనసాగలేదని పేర్కొన్నారు. అలాగే, న్యాయస్థానం తీర్పు మేరకు జనార్ధన్ రెడ్డి శిక్ష అనంతరం ఇంకా ఆరు సంవత్సరాలపాటు ప్రజా పదవులు పొందడానికి అనర్హుడిగా ఉంటారు. అయితే, న్యాయస్థానం ఆయనకు శిక్షపై స్టే ఇస్తే మాత్రం ఈ అనర్హత తాత్కాలికంగా నిలిపివేయబడే అవకాశముంది. ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ ఖనిజ తవ్వకాల కేసులో జనార్ధన్ రెడ్డికి తోడు మరికొందరికి కూడా శిక్షలు విధించబడ్డాయి. ఇక ఆయన సంస్థపై కూడా రూ. 1 లక్ష జరిమానా విధించారు. కేసులో గాలి జనార్ధన్ రెడ్డి రెండవ నిందితుడిగా ఉన్నారు. నిజానికి జనార్ధన్ రెడ్డి, బళ్లారిలో బీజేపీకి బలమైన నేతగా ఒకప్పుడు గుర్తింపు పొందారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీకి వీడ్కోలు చెప్పి "కల్యాణ రాజ్య ప్రగతి పార్టీ (KRPP)" ఏర్పాటు చేసి గంగావతి నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2024లో మాత్రం KRPPను బీజేపీలో విలీనం చేసి పార్టీలో తిరిగి చేరారు. ప్రస్తుత పరిణామాలతో గంగావతి నియోజకవర్గం స్థానము ఖాళీ అయ్యింది. త్వరలో ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించే అవకాశం ఉంది.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం..!

న్యూఢిల్లీ,పాకిస్తాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం సౌత్ బ్లాక్‌లో సైన్యం, నేవీ, వాయుసేన అధిపతులతో సమావేశయయ్యారు. సమావేశానికి త్రివిధ దళాల అధిపతులతో పాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గత రాత్రి పాకిస్తాన్ జరిపిన దాడులు, భారత దళాలు స్పందించిన తీరుపై రాజ్‌నాథ్‌కు వివరించారు. ప్రస్తుతం సరిహద్దుల్లో పరిస్థితి, ప్రస్తుతం చేపట్టాల్సిన చర్యలపై వారితో రాజ్‌నాథ్ చర్చించారు. గతరాత్రి పాకిస్తాన్ సైన్యం డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడి చేసిన విషయం తెలిసిందే. ఇంతకు ముందు రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరిహద్దుల వెంట ఉగ్రవాద స్థావరాలు, మౌలిక సదుపాయాలు లక్ష్యంగా చేసుకొని జరిపిన దాడుల్లో వంద మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని.. ఇప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. పాకిస్తాన్ నుంచి రొచ్చగొట్టే చర్యలుంటే స్పందించేందుకు భారత సైన్యం సిద్ధంగా స్పష్టం చేశారు. శత్రువులు దాడి చేస్తే ప్రతీకారం తీర్చుకునేందుకు వెకాడబోమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు



సమావేశానికి హాజరైన విషయం తెలిసిందే. అనంతరం పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ అన్ని పార్టీలు ప్రభుత్వానికి సంఘీభావం తెలిపాయరన్నారు. జాతీయ భద్రత రాజకీయాల కంటే ముఖ్యమని అందరూ అంగీకరించారన్నారు. అలాగే, నేతలంతా సాయుధ దళాలను ప్రశంసించారని.. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు పూర్తి మద్దతును ప్రకటించారని ఆయన పేర్కొన్నారు.


## అత్యవసరంగా జమ్మూకు ఒమర్ అబ్దుల్లా..

శ్రీనగర్ : జమ్మూలోని పలు ప్రాంతాలపై గురువారం పాక్ డ్రోన్‌దాడులకు తెగబడ్డ విషయం తెలిసిందే. ఈ దాడిని భారత సైన్యం తిప్పికొట్టింది. ఈ క్రమంలో పరిస్థితిని సమీక్షించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా శ్రీనగర్ నుంచి జమ్మూకశ్మీర్‌కు బయలుదేరి వెళ్లారు. జమ్మూ నగరంతో పాటు డివిజన్‌లోని ఇతర ప్రాంతాలపై పాక్ విఫల దాడుల తర్వాత పరిస్థితులను అంచనా వేసేందుకు జమ్మూ కశ్మీర్‌కు వెళ్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. జమ్మూ, సాంబా, ఆర్ఎస్ పురాతో పాటు పలు ప్రాంతాల్లో పాకిస్తాన్ డ్రోన్‌లు, స్మాల్ రేంజ్ మిస్సైల్స్ దాడికి ప్రయత్నించగా.. సైన్యం తిప్పికొట్టింది. పాకిస్తాన్ దళాల సహాయంతో ఉగ్రవాదులు అంతర్జాతీయ సరిహద్దులోని జమ్మూ కాశ్మీర్‌లోని సాంబా జిల్లాలో చొరబాటు ప్రయత్నించారు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దును దాటేందుకు చేసిన చొరబాటు ప్రయత్నాలను భగ్నం చేసినట్లు బీఎస్ఎఫ్ ప్రతినిధి తెలిపారు. బీఎస్ఎఫ్ వేగంగా స్పందించడంతో ఉగ్రవాదులు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని ప్రతినిధి పేర్కొన్నారు.



ఇదిలా ఉండగా.. బారాముల్లా జిల్లాలోని ఉరి సెక్టార్‌లోని పౌర నివాస ప్రాంతాలపై పాకిస్తాన్ భారీ మోర్టార్లతో దాడి చేసింది. ఈ ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. మరరొకరు గాయపడ్డారు.

## భారత్,ఇజ్రాయిల్ ఒక్కటే.. పాక్ రక్షణ మంత్రి అబద్ధాల ప్రచారం..



ఇస్లామాబాద్: భారతదేశం చేతిలో ఎన్ని సార్లు భంగపాటుకు గురైనా నాదే పైచేయి అంటుంది పాకిస్తాన్. అబద్ధాలను అవలీలగా ప్రచారం చేస్తుంది. చివరకు పాకిస్తాన్ ప్రభుత్వంలో అగ్ర నేతలుగా చలామణీ అవుతున్న వారు కూడా అబద్ధాలను ప్రచారంలో చేయడంలో పోటీ పడుతున్నారు. తమ పౌరుల్ని అబద్ధాలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ నుంచి పాకిస్తాన్‌ని భారత్ త్రివిధ దళాలు చితకబాదుతున్నా కూడా బుద్ధి రావడం లేదు. తాజాగా, ఈరోజు జరిగిన పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీ సమావేశాల్లో పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మళ్లీ అబద్ధాలకు తెరతీశాడు. భారతదేశంతో ఉద్రిక్తత నేపథ్యంలో పాకిస్తాన్‌పై ఇతర దేశాల ఒత్తిడిని అంగీకరించేది లేదని చెప్పాడు. పాక్ ఆర్మీ భారత పౌరుల్ని లక్ష్యంగా చేసుకోదని, కేవలం వారి సైనిక స్థావరాలనే టార్గెట్ చేస్తామని చెప్పారు. తాము భారత్‌కి ధీటుగా 200 శాతం స్పందించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించాడు. భారత్ తన సొంత ప్రజల్ని శాంతింపచేయడానికి వారి మీడియా తప్పుడు ప్రచారం చేసిందని పాక్ మంత్రి ఆరోపించాడు. భారత్ ఓడిపోతుందనే విషయాన్ని చెప్పడం లేదని అన్నారు.

సంపాదకీయం
శనివారం 10-05-2025

# అరకొర వైద్యంతో అగచాట్లు

దివ్యాంగుల పట్ల వ్యవస్థాగతమైన వివక్ష చూపడం సరికాదని, ఆ ప్రవృత్తికి ముగింపు పలకాలని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. ప్రభుత్వాలు ఏం చెప్పినా, దేశంలోని దివ్యాంగుల్లో 82శాతం మందికి ఆరోగ్య బీమా లేదనేది వాస్తవం.దివ్యాంగుల పట్ల వ్యవస్థాగతమైన వివక్ష చూపడం సరికాదని, ఆ ప్రవృత్తికి ముగింపు పలకాలని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించింది. ప్రభుత్వాలు ఏం చెప్పినా, దేశంలోని దివ్యాంగుల్లో 82శాతం మందికి ఆరోగ్య బీమా లేదనేది వాస్తవం. ప్రభుత్వ ఆరోగ్య పథకాల్లో లబ్ధిదారులుగా చేరిన దివ్యాంగులు, సాధారణ పౌరులకే సరైన చికిత్స అందడం లేదు. అలాంటిది అసలు లబ్ధిదారులుగా చేరనివారి పరిస్థితి మరెంత దయనీయంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.భారత్‌లో 2019–21 మధ్య జరిగిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం, దేశంలో సుమారు 6.33 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరి సంఖ్య ఎంతన్నది తదుపరి జనగణనలో కచ్చితంగా తెలియరానుంది. దేశ ప్రజల కోసం 'ఆయుష్మాన్ భారత్‌– ప్రధానమంత్రి జనారోగ్య యోజన' బీమా పథకం ఉందనే సంగతి 42శాతం మందికి తెలియదని ఇటీవలి కేంద్ర ప్రభుత్వ సర్వేలో తేలింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య బీమా పథకాల కింద లబ్ధిదారులు ఏయే ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవచ్చో తెలుపుతూ సుదీర్ఘ జాబితాలు ఇస్తుంటారు. కానీ, వాటిలోని చాలా ఆస్పత్రులు లబ్ధిదారులకు చికిత్స నిరాకరించిన సందర్భాలెన్నో! అయినాసరే, వాటిపై చర్యలు కొరవడుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ అమలవుతున్న ఆస్పత్రుల్లోనూ ఇన్‌–పేషంట్లకే తప్ప, అవుట్‌ పేషంట్లకు చికిత్స లభించట్లేదనే విమర్శలున్నాయి. ఆరోగ్యంపై వెచ్చిస్తున్న మొత్తం వ్యయంలో 80శాతం అవుట్‌ పేషంట్ ఖర్చులేనని ఇక్కడ గమనించాలి.

ప్రైవేటు రంగానిదే పైచేయి

ప్రభుత్వ ఆస్పత్రులే తక్కువ అనుకుంటే, వాటిలో సేవలు మరీ అరకొరగా అందుతున్నాయి. ప్రతి వెయ్యిమంది రోగులకు ఒక వైద్యుడు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. కానీ, భారత్‌లో ప్రతి 1500 మందికి ఒక వైద్యుడు ఉన్నారని ఇండియన్‌ బ్రాండ్‌ ఈక్విటీ ఫౌండేషన్‌(ఐబీఈఎఫ్‌) అంచనా వేసింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా– దేశంలో ప్రతి 811 మందికి ఒక వైద్యుడు చొప్పున ఉన్నారని లోక్‌సభలో వెల్లడించారు. బహుశా ఆయన అలోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, యునాని తదితర వైద్యులను కూడా కలిపి లెక్క చెప్పినట్టుంది. భారత్‌లో అలోపతి డాక్టర్ల సంఖ్య 13.86 లక్షలైతే– ఆయుర్వేద, హోమియో, యునాని తదితర విభాగాల్లోని వైద్యుల సంఖ్య 5.65 లక్షలు. ఇక ప్రతి వెయ్యి మందికి ముగ్గురు నర్సులు చొప్పున ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేయగా, భారత్‌లో 1.7మంది నర్సులు చొప్పునే ఉన్నారని ఐబీఈఎఫ్ వెల్లడించింది. ప్రపంచంలోని ముఖ్యమైన దేశాలు ప్రజారోగ్యం కోసం జీడీపీలో 5 నుంచి 12.5శాతం వెచ్చిస్తుంటే, భారత్ 2026లో అందుకు వెచ్చించబోయేది 1.9శాతానికే పరిమితమవుతుందని అంచనా! ప్రభుత్వం తగినన్ని నిధులనూ, ఆస్పత్రి సేవలనూ అందించలేకపోతోంది. దాంతో వైద్యసేవల్లో ప్రైవేటు రంగానిదే పైచేయి అవుతోంది. నేడు దేశంలోని మొత్తం ఆస్పత్రుల్లో 58శాతం ప్రైవేటు రంగానివే! 2022–23 నాటికి దేశంలో మొత్తం 43,186 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. అయితే ఇవి ప్రధానంగా పట్టణాలు, నగరాల్లోనే కేంద్రీకృతమయ్యాయి. వైద్యులు, సహాయకుల్లో ఏకంగా 81శాతం మంది ప్రైవేటు ఆస్పత్రుల్లోనే పనిచేస్తున్నారు. సర్కారీ వైద్య సేవల కొరత, బీమా సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే విపరీతమైన ఖర్చులను భరించలేక జనాభాలో ఏడు శాతం మంది పేదరికంలోకి జారిపోతున్నారని నీతిఆయోగ్ ఆందోళన వ్యక్తం చేసింది.

అనవసర పరీక్షలతో జేబులు గుల్ల

ప్రైవేటు ఆస్పత్రులు రోగుల ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా భారీగా రుసుములు పిండుతున్నాయి. చాలామంది వైద్యులు ల్యాబులు ఇచ్చే ముడుపులకు ఆశపడి అనవసర పరీక్షలు చేయిస్తున్నారు. కొందరు డాక్టర్లు రకరకాల పరీక్షలు చేయించుకోవాలని రోగులకు చీటీ రాసి, వాటిలో కొన్ని పరీక్షల్ని చేయాలని 'కోడ్‌ భాషలో' సూచిస్తారు. ల్యాబ్ నిర్వాహకులు అది అర్థం చేసుకుని అవసరమైన పరీక్షలను మాత్రమే చేసి, మిగతా వాటికి బోగస్‌ నివేదికలు అందజేస్తారు. కానీ, పరీక్షల కోసమని రోగుల నుంచి ఎక్కువ రక్తం సేకరించి, తరవాత సింక్‌లో పారబోస్తారు. అందుకే ఈ తరహా పరీక్షలను 'సింక్‌ టెస్ట్‌లు' అంటున్నారు. కొందరు డాక్టర్లు రోగులను ఇతర వైద్యుల దగ్గరికి పంపుతారు. అక్కడ రోగులు చెల్లించే మొత్తాన్ని ఇద్దరూ పంచుకుంటారు. చట్టపరమైన నిషేధం ఉన్నప్పటికీ, లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. అవసరం లేకపోయినా సిజేరియన్‌, కంటి శుక్లాలు, మోకాలు కీళ్ల మార్పిడి, వెన్నుకు శస్త్రచికిత్సలు చేస్తుండటం చూస్తున్నాం. ఫార్మా కంపెనీలపైనా ఇటువంటి ఆరోపణలున్నాయి.

ప్రపంచంలోనే మేటిగా నిలవాలంటే...

మీకు భారీగా జీతభత్యాలు చెల్లిస్తున్నాం కాబట్టి రోగులకు వీలైనన్ని పరీక్షలు రాయాలి. ఫీజులను అధికంగా వసూలు చేయాలి' అని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు తమ దగ్గర పనిచేసే వైద్యులను డిమాండ్‌ చేస్తాయి. ఇలాంటి పద్ధతులను భారత వైద్యమండలి నిషేధించినా ఫలితం శూన్యం. భారతీయ ఆరోగ్య సేవల మార్కెట్ విలువ 2016లో 11వేల కోట్ల డాలర్లు. అది 2023 నాటికి భారత్‌కు 63,500 కోట్ల డాలర్లకు చేరుతుందని ఐబీఈఎఫ్‌ అంచనా. నిరుడు ఆరోగ్య బీమా ప్రీమియం వసూళ్లు రూ. 2.63లక్షల కోట్లకు చేరాయి. గతేడాది 769కోట్ల డాలర్లుగా ఉన్న భారతీయ వైద్య పర్యాటకం 2029కల్లా 1431కోట్ల డాలర్లకు చేరనుంది. అధునాతన వైద్య చికిత్సల కోసం ఏటా అయిదు లక్షల మంది రోగులు భారత్‌కు వస్తున్నారు. దీన్ని బట్టి భారతీయ వైద్యరంగం పటిష్ఠంగానే ఉందనీ, ఆరోగ్య రంగం సేవా దృక్పథాన్ని అనుసరిస్తే ప్రపంచంలోనే మేటిగా నిలవగలదని అర్థమవుతోంది. మార్కెట్‌ శక్తుల వల్ల ప్రజారోగ్యానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం జాగ్రత్త వహించాలి.

# వ్యూహాత్మక రక్షణ కేంద్రం హైదరాబాద్..

హైదరాబాద్ : పహల్గాం ఉగ్రదాడితో దేశం అప్రమత్తమైంది. అన్ని ప్రధాన నగరాలు యాక్షన్ మోడ్‌లోకి వచ్చేలా కేంద్రం అలర్ట్ చేస్తున్నది. అందులో భాగంగా యుద్ధం వస్తే తలెత్తే పరిణామాల నుంచి హైదరాబాద్ నగరానికి పొంచి ఉన్న ముప్పు నుంచి అప్రమత్తం చేయడమే ముఖ్యోద్దేశ్యంగా బుధవారం నగరంలో ఆపరేషన్ అభ్యాస్ పేరిట మాక్ డ్రిల్స్ నిర్వహించారు. కాగా, తాజాగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఇప్పుడు అందరీ దృష్టి హైదరాబాద్‌పై పడింది. నిజాం కాలం నుంచే వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా నిలిచిన మహానగరం నాటి నుంచి నేటివరకు త్రివిధ దళాల స్థావరంగా కొనసాగుతూనే ఉంది. క్లిష్ట సమయంలో సైనికులకు ఆయుధాలను అందించే ఆయుధ భాండాగారంగా ఉంటూనే, రక్షణ వ్యవస్థకు సురక్షితమైన, వ్యూహాత్మక కేంద్రంగా నిలుస్తున్నది. రక్షణ శాఖకు అవసరమైన అన్ని మౌలిక వసతులను అందించే కేంద్రంగా, సైబర్ దాడులను ఎదుర్కొనే సైబర్ టెక్నాలజీ కలిగిన ప్రాంతంగా, ఎయిరోస్పేస్ హబ్‌గా నిలవడంతోనే హైదరాబాద్‌పై ఇప్పుడు అందరీ దృష్టి పడింది.అమ్ములపొదిలో రక్షణ వ్యవస్థ కేంద్రీకృతమైనట్లుగా ఉండే హైదరాబాద్‌ను విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే అత్యంత కీలకమైన, వ్యూహాత్మక ప్రాంతంగా అభివర్ణిస్తారు. దీనికి నగరం చుట్టూరా ఉన్న మిలటరీ, ఎయిర్‌ఫోర్స్, సైంటిఫిక్ తదితర సంస్థలే కారణం. దీంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థలోనూ ముఖ్యభూమికను పోషిస్తున్నది. ఐటీ కేంద్రంగా, ఏయిరోస్పేస్ హబ్‌గా పేరుగాంచిన మహానగరంలో 37కు పైగా కేంద్ర రక్షణ, పరిశోధన, రక్షణ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో అంతరిక్ష పరిశోధనలకు ఇస్రోకు ఉపయోగపడే డేటా సెంటర్‌తోపాటు శాటిలైట్ తయారీలో అవసరమైన చిన్న చిన్న బోల్టులు, ఇంజిన్లు, టర్బైన్లు లాంటి అనేక పరికరాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. హకీంపేటలో కేంద్రీకృతమైన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోని టాటా ఎయిరోస్పేస్ సెంటర్, క్షిపణి రూపకల్పనలో కీలకపాత్ర పోషించే డీఆర్డీవో తదితర పదుల సంస్థలతో రక్షణ పరిశోధనలకు నగరం కేంద్రంగా ఉంది.

నగరవ్యాప్తంగా రక్షణ సంస్థలే

%యుద్ధ సమయంలో రక్షణరంగానికి అవసరమైన ఆయుధ సంపత్తిని అందించడంలో హైదరాబాద్ ముందంజలో ఉంది. డిఫెన్స్ రిసెర్చ్, ఉత్పాదక వ్యవస్థలతోపాటు రక్షణ రంగానికి అవసరమైన డీఆర్డీవో, డీఆర్డీఎల్, రిసెర్చ్ సెంటర్ ఇమ్రాత్, డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చ్ లాబోరేటరీ, అడ్వాన్స్‌డ్ సిస్టం ల్యాబోరేటరీ, అణు ఉత్పత్తుల్లో కీలకమైన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ).. ఇలా 37కు పైగా రక్షణ, వాయు, రక్షణ పరిశోధన, సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన సంస్థలన్నీ నగరవ్యాప్తంగా కొలువై ఉన్నాయి. ఒకవేళ యుద్ధం వస్తే శత్రుమూకల నుంచి రక్షణ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ ప్రాంతం వ్యూహాత్మక స్థావరంగా సహజసిద్ధంగా గుర్తింపు పొందింది. అందుకే మొదటినుంచి హైదరాబాద్‌లో అనేక రక్షణరంగ సంస్థలను నెలకొల్పారు.

సిటీ అమ్ములపొదిలో ఎయిర్ డిఫెన్స్

ఎయిర్ బేస్ సెంటర్‌గా పిలిచే హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ సెంటర్ దేశంలోని ప్రధాన ఎయిర్ బేస్ సెంటర్ల కంటే పెద్దది. బెంగళూరు, చెన్నై నగరాల్లోని ఎయిర్ బేస్ సెంటర్ల కంటే విస్తీర్ణంలో, వ్యూహాత్మక వాయు దాడులను సమర్థవంతంగా నిర్వహించడంలో హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ సెంటర్ ముఖ్య భూమికను పోషిస్తున్నది. ఫైటర్‌జెట్లతోపాటు, హెలికాప్టర్ పైలట్లను ఇది అందిస్తున్నది. దక్షిణాది నుంచి శత్రు దేశాలపై విరుచుకుపడేలా ఎయిర్‌ఫోర్స్ సెంటర్‌గా హకీంపేట నిలుస్తున్నది. ఇక బోయింగ్ విమానాల ఉత్పత్తులు, టాటా లాక్‌హీడ్ మార్టిన్ వంటి అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలు ఇక్కడ ఉన్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ అండ్ డిఫెన్స్ సిస్టంతోపాటు, అకాశ మార్గంలో గుట్టుగా



దూసుకుపోతూ శత్రు స్థావరాలను నిర్వీర్యం చేసే రాఫెల్ ఫైటర్ జెట్లను అందించే రాఫెల్ అడ్వాన్స్ డిఫెన్స్ సిస్టమ్, ఆధునాతన డ్రోన్లను ఉత్పత్తి చేసే స్టార్టప్‌లు పదుల సంఖ్యలో హైదరాబాద్ కేంద్రంగా నిర్విరామంగా సేవలందిస్తున్నాయి.

సైబర్ దాడులను ఎదుర్కొనేలా

%దేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్ నగరం ముష్కర మూకల సైబర్ దాడులను సమర్థంగా ఎదుర్కొనే కేంద్రంగా పేరుగాంచింది. సిటీ కేంద్రంగా వందల ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా.. సైబర్ సెక్యూరిటీలోనూ హైదరాబాద్ ప్రధాన బాధ్యత వహిస్తున్నది. మైక్రోసాఫ్ట్, గూగుల్, టీసీఎస్ వంటి ఎన్నో కంపెనీలు డిఫెన్స్ అనుబంధ రంగాలకు సైబర్ సెక్యూరిటీ సేవలను అందిస్తుండగా, డేటా సెక్యూరిటీ కౌన్సిల్‌కు ప్రాంతీయ కేంద్రంగా రక్షణ పరిశోధన కేంద్రాలైన డీఆర్డీవో, డీఆర్డీఎల్, ఆర్‌సీఐ, ఈసీఐఎల్‌తో కలిసి కమాండ్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌కు ఇక్కడే రూపకల్పన చేశారు. భారత సైన్యానికి ఆపత్కాలంలో కీలకమైన సమాచారాన్ని చేరవేసేలా హైదరాబాద్ నిలుస్తున్నది.

నగరంలోని పలు డిఫెన్స్ సంస్థలు..

–డీఆర్డీవో: త్రివిధ దళాలకు అవసరమైన ఆధునాతన క్షిపణులకు జీవం పోస్తుంది.

– డీఎంఆర్ఎల్: అత్యంత తేలికైన మిశ్రమ లోహాలను ఉత్పత్తి చేయడంలో కీలకం. డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ ఇప్పటికీ ఎన్నో రకాల ఆర్మ్‌డ్ ఫోర్సెస్, మిస్సైల్, ఎయిర్‌క్రాఫ్ట్‌లను అందిస్తున్నది.

– డీఆర్‌డీఎల్: మిస్సైల్ డెవలప్‌మెంట్‌లో ముఖ్యభూమికను పోషించే ఈ సంస్థ ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు సారథ్యం వహిస్తున్నది. ఇక్కడే పృథ్వీ, ఆకాశ్ లాంటి మిస్సైళ్లను తయారు చేశారు.

–ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ: యుద్ధ ట్యాంకుల నుంచి మొదలుకొని సైన్యం వినియోగించే ఎన్నో రకాల యుద్ధ సామగ్రి ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ తయారు చేసిన ఎన్నో యుద్ధ ట్యాంకులు ఇప్పటికే భారత సైన్యానికి సేవలు అందిస్తున్నాయి.

–మరమ్మతుల స్థావరం ఎంసీఈఎంఈ: మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ సంస్థ.. సైనికులు వినియోగించే అన్ని రకాల యుద్ధ సామగ్రికి మరమ్మతులు చేసే మెకానికల్ ఇంజినీర్లను అందిస్తున్నది. అధునాతన మిలటరీ పరికరాలు, రాడార్ వ్యవస్థలు, వాహనాలు విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా చూసే నిర్వహణ బాధ్యతలను ఇది భుజాన వేసుకున్నది.

– ఎన్ఐఎస్ఏ: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ దేశంలోని డీఆర్డీడీవో, బీడీఎల్, ఎయిర్‌పోర్టులను సంరక్షించే సీఐఎస్ఎఫ్ బలగాలను అందిస్తున్నది. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బంది భారత సైన్యంతోపాటు, ఇతర రక్షణ విభాగాలకు సేవలు అందిస్తున్నారు. వీటితోపాటు 30కిపైగా రక్షణ, రసాయన, పరిశోధన సంస్థలు కూడా హైదరాబాద్ కేంద్రంగా సేవలు అందిస్తున్నాయి.

# మరో సామాజిక విప్లవం...



న్యూఢిల్లీ,చరిత్ర అన్ని వేళలా ఒకేలా ఉండదు, కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉంటుంది. కారల్ మార్క్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్యమం, 20 శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కులగణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్సి, ఎస్టిల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.మొదటి బిపి కమిషన్ కాక కాళేశ్వర్ కమిషన్ సందర్భంగా, రెండవ బిసి కమిషన్ మండల కమిషన్ సందర్భంగా జనగణనలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జనగణనలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. జనగణనలో కులగణనకై డిమాండ్ ఎన్నిసార్లు ముందుకొచ్చినా కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా ప్రయోక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో భాష ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. 70 సంవత్సరాల భాష ప్రయోక్త రాష్ట్రాల చరిత్రలు దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడా సంభవించలేదని చెప్పవచ్చు.అంటే ఒక విషయంపై మనలో చాలా కాలంగా గూడుకట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది. జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రె పార్టీదే.అయినప్పటికీ 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుపిఏ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ఎన్‌డిఏ ప్రభుత్వం జనగణనలో కులగణనను వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం. అయితే ఈ ఘనత మాత్రం దేశవ్యాప్తంగా ఈ వాదాన్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డిఎంకె, ఎస్‌పి, ఆర్‌జెడి లాంటి ప్రాంతీయ పార్టీలది. కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో చట్టం చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానిదే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణనకు వాగ్దానం చేయడం, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం, బిసి సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కులగణన జరగడం, విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేస్తూ కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి.42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం బిసి సంఘాలు ఢిల్లీలో 'జంతర్ మంతర్' వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చిండోచ్చు. కర్ణాటక, తెలంగాణ తోపాటు బీహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలోపడి ఉండవచ్చు. బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చివరి ఉపన్యాసంలో మాట్లాడిన మాటలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ప్రభావాన్ని చూపి ఉండవచ్చు. 'ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా 26 జనవరి 1950 నుంచి మనం రాజకీయ సమానత్వంలోకి అడుగు పెట్టబోతున్నాం. కానీ కొన్ని వందల సంవత్సరాలుగా మన దేశంలో ఉన్న ఆచార, సంప్రదాయాలు మన సమాజంలో సామాజిక, ఆర్థికంగా సమానత్వం సాధించుటకు ప్రతిబంధకాలుగా ఉన్నాయి. రానున్న ప్రభుత్వాలు ఆ ప్రతిబంధకాలను తొలగిస్తూ సామాజిక, ఆర్థిక సమానత్వానికై ప్రయత్నించాలి. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించనినాడు పీడిత ప్రజలు ఈ రాజ్యాంగ సభ కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామిక వ్యవస్థను కుప్పకూలుస్తారు అని హెచ్చరించారు. ఈ 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో మెజారిటీ వర్గాలైన బిపి ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వం చేకూర లేదనే చెప్పవచ్చు. ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ద్వారా రాజకీయ సమానత్వం ఉన్నట్లు కనబడిన, ఆర్థిక అసమానతలు, ఓటు హక్కును నిజాయితీగా ఉపయోగించుకోలేని పరిస్థితుల వల్ల అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం గల రాజకీయ సమానత్వం ఇప్పటికీ సాధ్యం కాలేదు. దీనికి తోడు రాత్రికి రాత్రి ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ తీసుకొచ్చిన కేంద్రంపై దేశవ్యాప్తంగా బిసిలందరూ అసంతృప్తితో ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ తగ్గడం, రానున్న బీహార్, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో జనగణనలో కులగణననే ప్రధాన ప్రచారాంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు.సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించాలంటే దేశవ్యాప్తంగా డిమాండ్‌గా వస్తున్న జనగణనలో కులగణన ఒక్కడే పరిష్కార మార్గంగా కేంద్రం భావించి ఉండవచ్చు. జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు. రానున్న జనగణనలో కులగణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బిసి సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు.

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన

తిరుపతి,ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు– దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ– యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు– స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు– చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ– ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ– పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు–కు అన్ని రకాలుగా తోడ్పాటు– అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు– చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట–కి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

# ఆ ఊరు ఏది, ఎందుకంత భయం..?

హైదరాబాద్,ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా..ఓ నియోజకవర్గంలో అమాత్యులు అడుగు పెట్టాలంటేనే తెగ ఆలోచిస్తున్నారట. ఎమ్మెల్యే ఆహ్వానించినా మంత్రులు రావడానికి జంకుతున్నారట. ఇందుకు ఓ రాజకీయ కారణం ఉందనే చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఉప్పు..నిప్పులా ఉన్న నేతల మధ్య జోక్యం చేసుకోవడం కంటే కాస్త దూరంగా ఉండడమే మంచిదనుకుంటున్నారట ప్రభుత్వ పెద్దలు. సీనియర్ నేతతో పంచాయితీ మాకెందుకు అనుకునే వారు నియోజకవర్గ రాజకీయాల్లో తల దూర్చడానికి భయపడుతున్నారట. ఇంతకీ ఇరుగు పొరుగు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్న మంత్రులు ఎందుకు ఆ నియోజకవర్గానికి ఆమడ దూరంలో ఉంటున్నారు? కండువా కప్పుకున్న ఎమ్మెల్యేను అక్కున చేర్చుకున్నట్లా? లేనట్టా?

వామ్మో జగిత్యాలకా మేం రాం అంటున్న మంత్రులు..!

జగిత్యాల కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనే చెరగని ముద్ర వేసుకున్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత జీవన్ రెడ్డికి ఊహించని పరిణామాలు ఎదురవుతున్నాయి. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను హస్తం పార్టీలో చేర్చుకోవడాన్ని జీవన్ రెడ్డి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఆయనతో కలిసి పని చేయడానికి ససేమిరా అంటుండడంతో రెండు వర్గాలుగా విడిపోయింది జగిత్యాల కాంగ్రెస్. ప్రస్తుతం ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా తయారైందట పరిస్థితి.జీవన్ రెడ్డి సీనియర్ నేత కావడంతో ఆయనతో సన్నిహితంగా ఉన్న వాళ్లంతా..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కి దూరంగా ఉంటున్నారు. అందుకే జీవన్ రెడ్డిని కాదని కొంతమంది పార్టీ శ్రేణులు..సంజయ్ కుమార్ తో సఖ్యతగా మెదలడం లేదనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవైనా ప్రారంభించాలన్నా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలన్నా జగిత్యాలకు అమాత్యులు ఆమడ దూరం ఉంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

సంజయ్ కుమార్ ను ఒంటరిని చేయడానికేనా?

అయితే పొరుగు నియోజకవర్గమైన ధర్మపురి ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా అధ్యక్షుడైన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సైతం జీవన్ రెడ్డి మాట జవ దాటరు. అందుకే జీవన్ రెడ్డి పట్ల విధేయతను ప్రదర్శించే క్రమంలో లక్ష్మణ్ కుమార్..ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని కలుపుకొని వెళ్లేందుకు సంకోచిస్తుంటారట. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం జీవన్ రెడ్డిని కాదని నియోజకవర్గంలో అడుగు పెట్టే పరిస్థితి లేదట. ధర్మపురి నియోజకవర్గంలో జరిగే ఏదో ఒక అభివృద్ధి పనులకు మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరవగా..వారంతా జగిత్యాలను టచ్ చేయకుండానే వెళ్లిపోతున్నారట. సంజయ్ కుమార్ ను ఒంటరిని చేయడానికే జీవన్ రెడ్డి మంత్రులను అడుగు పెట్టకుండా చేస్తున్నారనే టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో సాగుతోంది.

స్వపక్షంలో విపక్షంలా తయారైన ఇద్దరు నేతలు..

సీఎం రేవంత్ రెడ్డి మనిషిగానే ఎమ్మెల్యే సంజయ్ కి ముద్ర పడింది. సంజయ్ సైతం నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసం నేరుగా సీఎంనే సంప్రదించి నిధులను మంజురు చేయించుకుంటున్నారట. దీంతో కాంగ్రెస్ కండువా కప్పుకున్న సంజయ్ ని పార్టీ నాయకత్వం అక్కున చేర్చుకున్నట్లా లేనట్లా అనే చర్చ జగిత్యాల రాజకీయవర్గాల్లో జరుగుతోంది. ఇద్దరి మధ్య రాజీ కుదర్చడానికి ఎవరూ సాహసించకలేకపోతున్నారట. దీంతో ఇద్దరి మధ్య అంతర్గత విభేధాలు కాస్తా రచ్చకెక్కుతున్నాయి.ఇద్దరు నేతల వ్యవహారంతో స్వపక్షంలో విపక్షంలో మారింది పరిస్థితి. ఒకే జెండా కింద రాజకీయాలు సాగిస్తున్న జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్..వీరిద్దరి చేతులు కలిసేంత వరకు జగిత్యాలలో మంత్రులు అడుగు పెట్టరనే చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. ఇలా వీరిద్దరు ఎంతకాలమని కలవని రైలు పట్టాల్లా ఉంటారో చూడాలంటూ జిల్లాలో ఉన్న కాంగ్రెస్ నేతలు చర్చించుకుంటున్నారు.

అగ్రనేత



# సిబి అధికారిగా బెదరింపులు

విశాఖపట్నం,విశాఖపట్నంలో నకిలీ ఏసీబీ అధికారి కలకలం సృష్టించాడు.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బలగా సుధాకర్ చాలాకాలం కిందట విశాఖలోని ఆదర్శనగర్ పాత డెయిరీఫారం వద్ద నివాసం ఉంటూ..రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణిని కలిసి.. తాను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌నని పరిచయం చేసుకుని.. మీ ఆఫీస్‌లో అవినీతిపై తమకు చాలా ఫిర్యాదులు అందాయని, వాటిపై కేసు నమోదుచేయాల్సి ఉందంటూ బెదరించాడు.. అయితే, ఏసీబీ అధికారినంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి డబ్బులు డిమాండ్ చేసిన అతడిని విశాఖ పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేశారు.. అయితే, నకిలీ ఏసీబీ అధికారి కేసులో సంచలన అంశాలు వెలుగు చూస్తున్నాయి.. నకిలీ ఏసీబీ అధికారి కేసులో ఊహించని ట్విస్ట్ వచ్చింది. నకిలీ ఏసీబీ వెనుక కిలాడీ లేడీ ఖాకీ ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు.. ఆ కిలాడీ లేడీ ఖాకీ ఎవరో కాదు.. గతంలో నోట్ల మార్పిడి కేసులో సంచలనంగా మారిన రిజర్వుడు ఇన్స్పెక్టర్ స్వర్ణలత.. ఈ ఘటనతో లేడీ పోలీస్ స్వర్ణలత తన తీరు మార్చుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.. సస్పెండ్ అయ్యి జైలుకి వెళ్లొచ్చినా ఆమె వ్యవహార శైలిలో మార్పురాలేదు. మధురవాడ సబ్ రిజిస్టర్‌ను బెదిరించిన కేసులో ఈమె పాత్ర ఉందని తేల్చారు పోలీసులు... నకిలీ ఏసీబీ సుధాకర్ ను అడ్డుపెట్టుకొని డబ్బుల కోసం ఈ ఆగడాలకు దిగారట.. సుధాకార్ కాల్ లిస్ట్ ఆధారంగా స్వర్ణలత బండారం బట్ట బయలు అయినట్టు– అయ్యింది.. ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఏఆర్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు స్వర్ణలత.. ఈ వ్యవహారంలో వెలుగు చూడడంతో కిలేడీ లేడీ పోలీస్ పరారీలో ఉన్నారు. దీంతో, స్వర్ణలత కోసం పోలీసుల ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు..

# గుజరాత్ ఖావ్డా వద్ద డ్రోన్ పేలుడు

అహ్మదాబాద్,ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ విరుకుచుపడింది. ఈ దాడులతో ప్రస్తుతం భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో గుజరాత్‌లోని కచ్ జిల్లాలోని ఇండియా–పాకిస్తాన్ సరిహద్దు సమీపంలో అనుమానాస్పద పేలుడు సంభవించింది. దీంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఖావ్డా ఇండియా బ్రిడ్జి సరిహద్దు ప్రాంతంలో గురువారం ఉదయం డ్రోన్ పేలుడు సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు, వైమానిక దళ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే డ్రోన్ సరిహద్దు అవతల నుంచి వచ్చిందా లేదా అనేది ఇంకా నిర్ధారించలేదు. అయితే అనుమానాస్పద డ్రోన్ హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఢీకొట్టడంతో పేలుడు సంభవించినట్లు– తెలుస్తోంది. డ్రోన్ పేలుడుకు, పాకిస్తాన్‌కు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. భారత్ దాడులను జీర్ణించుకోలేని పాకిస్తాన్.. నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరుపుతోంది. గురువారం కూడా కాల్పులను కొనసాగిం చింది. అయితే భారత ఆర్మీకి వారికి దీటుగా సమాధానం ఇస్తోంది. పాకిస్తాన్ తిరిగి దాడులు చేయనుందనే సమాచరంతో భారత్ అప్రమైంది. సరిహద్దు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసింది. రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించింది. పోలీసు సిబ్బందికి సెలవులు రద్దు చేయడంతో పాటూ సెలవులో ఉన్న అధికారులను వెంటనే విధుల్లో హాజరు కావాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అలాగే సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వారందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు– చేస్తున్నారు.

## మద్యం స్కామ్ కేసులో నిందితులకు షాక్

న్యూఢిల్లీ,ఏపీ లిక్కర్ స్కాంలో నిందితులకు సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. ఈ కేసులో నిందితులు కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ ముగ్గురికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. ఈ కేసులో వీరికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ నిందితులు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ ముగ్గురికి మధ్యంతర రక్షణ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరిస్తూ.. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. ఈ కేసు మొదలైనప్పుడే ఈ ముగ్గురు కూడా ముందస్తు బెయిల్ కోసం సుప్రీం కోర్టుకు వచ్చారు. అయితే దీనికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున.. అక్కడ న్యాయస్థానం తీర్పు ఇచ్చిన తర్వాత ఇక్కడకు రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ పార్థివాలా, జస్టిస్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు చేసింది. ఈ క్రమంలో బుధవారం ఈ ముగ్గురు నిందితులు వేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణకు వచ్చింది. కానీ వీరికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించింది. దాంతో ఈరోజు సుప్రీం కోర్టు ముందుకు వచ్చిన ముగ్గురు నిందితులు.. హైకోర్టు నిరాకరించినందుకు తమకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని వినతి చేశారు. ఏపీ హైకోర్టులో వీరికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించినందున.. హైకోర్టులో పెండింగ్‌లో ఉండగానే సుప్రీంలో దాఖలైన ఈ పిటిషన్ నిరర్ధకమైందని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గతంలో వేసిన పిటిషన్‌ను సవరణ అయినా చేయాలి లేదా కొత్త పిటిషన్ అన్నా దాఖలు చేయాలని.. అంతవరకు దీనిని అనుమతించవద్దని ముకుల్ రోహత్గీ చెప్పారు. రోహత్గీ వాదనలతో ఏకభవించిన కోర్టు.. గతంలో వేసిన పిటిషన్‌ను సవరించి మరో పిటిషన్‌ను దాఖలు చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. అయితే 13 వరకు తమను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని ముగ్గురి తరపున వాదించిన న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. కానీ మధ్యంతర రక్షణ కల్పించేందుకు కూడా సుప్రీం కోర్టు నిరాకరించింది. అప్పటి వరకు మిమ్మల్ని మీరే కాపాడుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర బెయిల్‌పై మళ్లీ పిటిషన్ దాఖలు చేసిన తర్వాత 13వ తేదీన సుప్రీం కోర్టు విచారణ జరిపి మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# ప్రధాని మోడీ .. ఓ అనికేత్: పవన్ ట్వీట్


అమరావతి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ సంచలన ట్వీట్ చేశారు. ప్రధాని మోదీని అనికేత్ అని అభివర్ణించారు. అనికేత్ ఒక పేరు, ఒక సంకల్పమని తెలిపారు. తన సన్యాసి జీవితంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని అనికేత్ అని పిలిచేవారని పవన్ అన్నారు. అనికేత్ అంటే ఇళ్లు లేకుండా అని అర్థం అని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ప్రధాని గురించి పవన్ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'అనికేత్' – ఒక పేరు, ఒక సంకల్పం. తన సన్యాసి జీవితంలో, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీనియస్ అని సంబోధించారు.

# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట



హైదరాబాద్,అంతర్జాతీయ అతివల అందాల పోటీలతో తెలంగాణ టూరిజానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడికి వచ్చే వారంతా తెలంగాణ లోని ప్రధాన పర్యాకట కేంద్రాలను సందర్శించనుండంతో వాటి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియనుంది. ముఖ్యంగా గ్రామీణ పర్యాటకం వెలుగులోకి రానుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా భారగా ఏర్పాట్లు చేసింది. ఆహుతును పర్యాటక ప్రాంతాలకు తీసుకుని వెళ్లేలా ఏర్పట్లు చేసింది. తెలంగాణ పర్యాటకం అంటే రాజధాని హైదరాబాద్ మాత్రమే. మిస్ వరల్డ్ ఈవెంట్ ల నిర్వహణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పర్యాటకంను ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు– తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపే అవకాశం లభిస్తుంది. నాగార్జునసాగర్ బుద్ధవనం , బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి , ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ, సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగాన్ని బలపరుస్తూ, సాంస్కృతిక మార్పిడి, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోంది. ఆధ్యాత్మిక శాంతి, జ్ఞానోదయం కోసం ప్రయత్నిస్తున్నవారికి ఇది ఒక ఆదర్శ స్థలం. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. ప్రధాన ఆకర్షణ ఏకశిలా నంది విగ్రహం, ఇది శిల్పుల నైపుణ్యాన్ని చాటుతుంది. ఈ దేవాలయం తురుష్కుల దండయాత్రలో కొంత భాగం నాశనమై, 20వ శతాబ్దంలో పునరుద్ధరించబడింది. ప్రాచీన భారతీయ వాస్తుశిల్పం అద్భుతమైన నమూనాగా నిలిచింది. కాకతీయ రాజవంశం వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా, వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. 3 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భవ్యమైన ప్రాకారాలు, దీని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. కాకతీయ కళాతోరణం అనే సూక్ష్మశిల్పాలు కలిగిన తోరణం ఈ కోటకు ప్రత్యేక ఆకర్షణ. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియ జేస్తున్నాయి. తెలంగాణ సంపన్న సాంస్కృతిక వారసత్వానికి ఈ కోట ఒక జీవంత ముద్ర. చారిత్రక ప్రాధాన్యత, శిల్ప సౌందర్యం కారణంగా ప్రతి ఒక్కరూ ఇక్కడికి తప్పక వెళ్లాల్సిన ప్రదేశంగా ఇది నిలిచింది. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్పు గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. ఇది 13వ శతాబ్దంలో గణపతి దేవ మహారాజు పాలనలో నిర్మించబడింది. ఈ శివాలయానికి ప్రధాన శిల్పి రామప్ప పేరు మీదుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పాలు, సుందరమైన నృత్య ముద్రలు, పురాణ కథలను చిత్రించే శిల్పాకృతులు అద్భుతంగా ఉంటాయి. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. పోచంపల్లి ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టుదారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.. 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు , పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు తద్వారా గ్రామీణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్ , హన్మకొండ , ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్టు థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు. అలాగే ఈ నెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్టును సందర్శిస్తారు. ఇదే రోజు వరంగల్ జిల్లాలో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. అక్కడే ఏర్పాటు– చేసిన పేరిణి నృత్యంను తిలకిస్తారు. 15న యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్‌పీరియన్సల్ టూర్‌లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. 16న మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వృక్షాన్ని సందర్శిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల చే నిర్వహించే ఆర్ట్స్ , క్రాఫ్ట్స్ వర్క్ షాప్‌కు హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మొత్తంగా తెలంగాణ టూరిజానికి ప్రాముఖ్యత ఏర్పడనుంది.

# పివోకె స్వాధీనంతో పాక్‌కు బుద్ధి చెప్పాలి !



జమ్ము కశ్మీర్: ఒక్క ఆపరేషన్ సిందూర్‌తో పాక్ దుష్టబుద్ధిని అణచివేయలేం. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న తీరును దారికి తేలేము. దాని వక్రబుద్ధిని మార్చలేము. భారత్‌తో పెట్టుకుంటే ఇక జీవితం లేదన్న రీతిలో తగిన బుద్ది చెప్పాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను సంపూర్ణంగా శాశ్వతంగా సాధించాలి. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి. జీవితంలో మళ్లీ కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పాలి. ఇది అంత సులవయిన పని కాకున్నా ఇందుకు మనం కొంత త్యాగం చేయక తప్పదు. పివోకెపుశాశ్వతంగా స్వాధీనం చేసుకుంటే తప్ప పాక్‌ను కట్టడి చేయలేమని మోడీ గుర్తించాలి. మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు నోరు మూసుకుంటే మంచిది. పహల్గామ్ దాడి తరవాత ఆయన చేసిన వ్యాఖ్యలు క్షంతవ్యం కాదు.ఇకపోతే పాక్కు దారికి తేవాలంటే శాశ్వతంగా దాని మెడలు వంచాల్సిన అవసరం ఉంది. అది ఎప్పుడో జరగాల్సి ఉన్నా..నెహ్రూ, ఇందిరల నిర్వాకం వల్ల భారత్ ఎంతో మూల్యం చెల్లించుకుంది. నెహ్రూను ప్రధానిని చేయడం లక్ష్యంగా గాంధీ అనుసరించిన విధానం కారణంగా జిన్నా పాక్ ఏర్పాటును బలంగా తీసుకుని వెళ్లారు. ఆంగ్ల పాలకులుకూడా ఇదే అదనుగా దేశాన్ని అడ్డంగా విభజించి గీతలు గీసారు. దీనిని ఆనాటి నాయకులు ఏ రకంగానూ వ్యతిరేకించలేదు. దేశ విభజన ఓ చీకటి అధ్యాంయగా మిగిలిపోయింది. విభజన సందర్భంగా వేల్లలో ముస్లింలు పాక్ వైపు వెళితే..లక్షల్లో హిందువుల శవాలు భారత్‌కు తరలించారు. ఆనాటి ఊచకోత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇలా ఊచకోతలు, బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లామిక్ రాజ్యంగా అవతరించిన పాక్ ఆదినుంచీ భారత్ వ్యతిరకతను నరనరాన జీర్ణించుకుంది. కాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించింది. దానిని పరిష్కరించలేక పోయిన నెహ్రూ 370 ఆర్టికల్‌తో కొత్త సమస్యలు తెచ్చి పెట్టారు. ఈ సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని నాటి కాంగ్రెస్ పాలకులు జారవిడుచుకున్నారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీన పర్చుకుంటే తప్ప పాక్ కోరలు పీకలేం. ప్రస్తుత పరిస్థితుల్లో యుద్దమంటూ జరిగితే ..అది పివోకెను ఆక్రమించుకునేదిగా మాత్రమే ఉండాలి. కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్తాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. అంతర్జాతీయంగా యాగీ చేస్తున్నారు. పివోకెలో ఉగ్రశిబిరాలను ఏర్పాటు చేసి దాడులకు ఉసిగొల్పుతున్నారు. చివరకు ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదకలు పాక్ సైనికులు సలాం కొట్టారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపు కోవడమే పనిగా పెట్టుకుని ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు గర్వహంగా చేయాలి. దాని ఉనికిని సవాల్ చేయాలి. కుంటూనే ఉన్నారు. భారత్ నుంచి విడిపోయి పాక్‌గా ఏర్పడ్డ పాక్... భారతదేశం తమకు శత్రువని పదేపదే రుజువు చేసుకుంటోంది. పాక్ సైనికాధికారులు ఎప్పుడూ భారత వ్యతిరేకతను నూరిపోస్తున్నారు. తాజాగా ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయి. కాశ్మీర్‌పై అక్కసు వెళ్లగక్కు తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో పదేపదే ప్రస్తావించి భంగపడ్డా పాక్‌కు బుద్ద ఇరావడం లేదు. 1971లో జరిగిన యుద్ధంతో బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగినా...పాక్ వంకర బుద్దిని మార్చుకోలేదు. 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారడంలేదు. ఉగ్రవావాలను పెంచి పోషించడంతో పాటు అబోటాబాద్‌లో లాడెన్‌కు ఆశ్రయమిచ్చి దాచి పెట్టాయి. అమెరికన్ దళాలు ఒసామాబిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత కూడా పాక్ సైన్యం బుద్ధి మారడం లేదు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుంటుందని తెలిసి కూడా కుక్కతోక వంకరలా బుద్ధి మార్చుకోవడం లేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానకోవడం లేదు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఊచకోతకు దారితీసింది.హిందువులను పేరుపెట్టి క్రూరంగా చంపిన ఘటనకు పాక్‌ను ఎంతగా ధ్వంసం చేసినా తక్కువే. అందుకే ఇప్పుడు సిందూర్‌తోనే మన దాడి ఆగకూడదు. ఇలాంటి దాడులు కొనసాగాలి. మనం కొంత నష్టపోయినా శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలి. భారత్‌లో జోక్యం చేసుకోకుండా, ఉగ్రవాదులను ప్రోత్సహించ కుండా కట్టడి చేయాలి. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసి అడుక్కుతినేలా చేయాలి. ఎందుకంటే ఒక్క పాక్ వల్లనే భారత్ ఎంతగానో నష్టపోయింది. పహల్గాం ఉగ్రదాడి ఉచ్చు తమచుట్టూ బిగుస్తోందని, భారత్ నుంచి ప్రతీకార దాడి తప్పదని లోలోపల పాక్ బెంబేలెత్తుతున్నా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శి స్తోంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ప్రేలాపనలు చేస్తూనే ఉన్నాడు. పాక్ సార్వభౌమాధి కారానికి, ప్రాదేశిక సమగ్రతకు ముప్పు తలెత్తినట్లయితే పాకిస్థాన్ పూర్తి సైనిక సత్తా చాటుతుందని వ్యాఖ్యానించారు. ఇలాంటి వారికి గట్టి బుద్ధి చెప్పాలి. సిందూర్ ఆపరేషన్ అంతంకాదు..ఆరంభమని ఆర్మీ మాజీ చీఫ్ నరవాణె చేసిన వ్యాఖ్యలు నిజం కావాలి.

### భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు

న్యూఢిల్లీ, భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ దేశ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఇండియాకు వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన భారత్‌కు విచ్చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో జరగనున్న 20వ ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ– అవ్వనున్నారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ.. అరాగ్చీకి సాదర స్వాగతం పలికింది. ఈ నేపథ్యంలోనే జై శంకర్ తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో ' విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీకి సాదర స్వాగతం. ఆయన ఢిల్లీలో జరుగుతున్న ఇండియా, ఇరాన్ జాయింట్ కమిషన్ మీటింగ్‌లో పాల్గొనడానికి వచ్చారు. ఇండియా, ఇరాన్ స్నేహ సంబంధాలు మొదలై 75 సంవత్సరాలు అవుతోంది. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య సంబంధాలను రివ్యూ చేసుకుని, మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తాం' అని వెల్లడించారు. ఇక, ఈ కార్యక్రమం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరగనుంది. పలు కీలక విషయాలపై రెండు దేశాల మంత్రులు చర్చించే అవకాశం ఉంది.

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

ఖమ్మం,ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు– ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు– ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు– చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ– వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ–వర్ సెంటర్ ఏర్పాటు– చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు– చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు– చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నా మన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు– చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్సులు విద్యార్థులకు అందుబాటు–లో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటు–లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ట్రంప్ కీలక నిర్ణయాలు

వాషింగ్టన్,అమెరికా పౌరసత్వ విధానాలు త్వరలో గణనీయంగా మారే అవకాశం ఉంది. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైతే, సంపన్నులకు పౌరసత్వాన్ని సులభతరం చేస్తూనే, వలసదారులు, శరణార్థులు, భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారిపై కఠినమైన చర్యలు తీసుకునే దిశగా విధానాలను రూపొందిస్తున్నారు.

– సంపన్నులకు 'గోల్డ్ వీసా':

ట్రంప్ ప్రతిపాదించిన ముఖ్య మార్పులలో ఒకటి 'గోల్డ్ వీసా'. దీని ప్రకారం.. 5 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టే అతి సంపన్న విదేశీయులకు కేవలం రెండు వారాల్లోనే అమెరికా పౌరసత్వం పొందే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం పౌరసత్వం పొందడానికి సంవత్సరాలు పడుతున్న సాధారణ ప్రక్రియను ఇది పూర్తిగా తగ్గిస్తుంది. సంపద ఆధారిత పౌరసత్వానికి ఇది పెద్దపీట వేస్తుందని విమర్శకులు అంటున్నారు.

– ఇతరులకు పెరగనున్న ఆర్థిక భారం:

ఇదిలా ఉండగా కొత్త రిపబ్లికన్ పార్టీ మద్దతుగల బడ్జెట్ ప్రతిపాదనలు పౌరసత్వం పొందాలనుకునే ఇతరులపై భారీ ఆర్థిక భారాన్ని మోపనున్నాయి. తల్లిదండ్రులు లేని మైనర్లకు 3,500 డాలర్లు, వర్క్ పర్మిట్లకు 550 డాలర్లు, ఇంతకు ముందు ఉచితంగా లభించిన ఆశ్రయం దరఖాస్తులకు 1,000 డాలర్లు రుసుము వసూలు చేయాలని ప్రతిపాదించారు. ఇది ఆర్థిక స్థోమత లేనివారికి అమెరికా పౌరసత్వం లేదా చట్టబద్ధమైన హెూదా పొందడాన్ని అత్యంత కష్టతరం చేస్తుంది.

– పుట్టుకతో వచ్చే పౌరసత్వంపై సవాల్:

ట్రంప్ అమెరికా రాజ్యాంగం హామీ ఇచ్చే పుట్టుకతో వచ్చే పౌరసత్వాన్ని కూడా రద్దు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.. అమెరికాలో చట్టబద్ధమైన పత్రాలు లేకుండా నివసిస్తున్న వలసదారుల పిల్లలకు లేదా తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు పుట్టుకతో పౌరసత్వం లభించకుండా చేయాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కేసు త్వరలో సుప్రీంకోర్టు విచారణకు రానుంది. ఒకవేళ ఇది ఆమోదం పొందితే, అమెరికాలో కొత్తగా దేశం లేని వ్యక్తుల వర్గం ఏర్పడే ప్రమాదం ఉంది.

– పౌరసత్వం రద్దు ప్రయత్నాలు ముమ్మరం:

మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, సహజసిద్ధమైన పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రయత్నాలను ట్రంప్ పునరుద్ధరించి, విస్తృతం చేశారు. గత ఫిబ్రవరిలో, జస్టిస్ డిపార్ట్మెంట్ "డెన్యాచురలైజేషన్ సెక్షన్" ను ఏర్పాటు చేసింది. దీనికి కాలపరిమితి లేదు. గతంలో చిన్న చిన్న తప్పులకు 700,000 మంది సహజసిద్ధ పౌరసత్వం పొందిన వారి పౌరసత్వాన్ని సమీక్షించే ప్రయత్నాలను ఇది గుర్తుచేస్తుంది. ట్రంప్ మాజీ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ ఈ ప్రయత్నాలను "టర్బోచార్జ్" చేస్తానని ప్రతిజ్ఞ చేశారు.

–చర్యలపై విమర్శలు:

ఈ చర్యలు అమెరికా యొక్క సంప్రదాయ విలువలు అయిన చేరిక , వైవిధ్యం , న్యాయం నుండి తీవ్రంగా వైదొలగడాన్ని సూచిస్తాయి. ట్రంప్ పౌరసత్వ విధానం మెరిట్ , మానవ గౌరవం కంటే సంపద , విధేయతకు ప్రాధాన్యత ఇస్తుందని విమర్శకులు అంటున్నారు. ఇది శతాబ్దాల నాటి వలసదారులకు స్వాగతం పలికి, అమెరికా వృద్ధికి దోహదపడిన వారసత్వాన్ని బలహీనపరుస్తుం

# కూటమి సర్కార్ మీద ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు ?



అమరావతి,రాష్ట్రాల స్థాయిలో చూసుకుంటే ఏ ప్రభుత్వం అయినా మారడానికి ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తారు అని అంటారు. చరిత్ర కనుక చూస్తే ఇదే సత్యం అని కూడా అనిపిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఏకంగా మూడున్నర దశాబ్దాలకు పైగా సర్వీసులో ఉంటారు. అంటే వారి సర్వీస్ కాలంలో ఏడు నుంచి ఎనిమిది దాకా సార్వత్రిక ఎన్నికలను చూస్తారు.ఇక వారు ప్రభుత్వంలో కీలకమైన భాగం. వారు తలచుకుంటే ఎవరైనా రాజు అవుతారు. అలాగే తరాజులు కూడా అవుతారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఎన్నికకూ ఒకసారి తమ రాజకీయ విధానాలను మార్చుకుంటారు అని చెబుతారు. అలాగే జరుగుతోంది కూడా.ఉమ్మడి ఏపీలో చూస్తే అటు కాంగ్రెస్ ఇటు టీడీపీ మాత్రమే రాజకీయ ప్రత్యర్థులుగా ఉండేవి. ఈ రెండు పార్టీలను ఎంచుకుంటూ తడవకో పార్టీని ఉద్యోగులు అధికారంలోకి తెచ్చారు. అయితే 1994 నుంచి 2004 దాకా రెండు సార్లు టీడీపీ వస్తే 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ రెండు సార్లు అధికారంలో ఉంది. ఇది ఒకింత మార్పుగా చూడాలి.విభజన ఏపీలో చూస్తే ఒకసారి టీడీపీ 2014 ఉద్యోగుల మద్దతుతో గెలిచింది అని చెబుతారు. 2019లో సీపీఎస్ రద్దు అన్న హామీతో వైసీపీని గెలిపించారు అని అంటారు. ఇక 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం వెనక ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర గణనీయంగా ఉంది అని ప్రచారంలో ఉన్న మాట.ఇవన్నీ పక్కన పెడితే కూటమి పాలనకు ఏడాది కాలం అవుతోంది. ఇంకా నాలుగేళ్ళ పాటు సమయం ఉంది. ఇంతలోనే ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు వచ్చిందా అన్న చర్చ సాగుతోంది. ఇలా ఎందుకు అంటే కొంతమంది మాజీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తాజాగా వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులలో కూటమి ప్రభుత్వం తీరు పట్ల మార్పు వచ్చిందని చెబుతున్నారు.అంటే వారిలో మెల్లగా అసంతృప్తి మొదలైందని, అది మరింతగా పెరుగుతుందని వారు అంటున్నారు. వారందరినీ వైసీపీ వైపుగా మళ్ళిస్తామని చెబుతున్నారు. ఇక వైసీపీకి అనుబంధంగా ఉన్న ఎంప్లాయిస్ పెన్షనర్స్ వింగ్ ను బలోపేతం చేసేందుకు మేమంతా కృషి చేస్తామని అంటున్నారు. అలాగే రాష్ట్రం కోసం ప్రజల కోసం జగన్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని ప్రజలు, ఉద్యోగుల దృష్టికి తీసుకువెళ్లేందుకు తాము కృషి చేస్తామని ఈ మాజీ ప్రభుత్వ ఉద్యోగులు చెబుతున్నారు.అంతే కాదు మళ్ళీ వైసీపీని అధికారంలోకి తెస్తామని వారు అంటున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఉద్యోగులలో ఇంతలోనే అంత మార్పు వచ్చిందా అన్న చర్చ సాగుతోంది. అయిదేళ్ళ వైసీపీ పాలనలో తాము నానా రకాలైన ఇబ్బందులు కడగండ్లూ పడ్డామని ఉద్యోగులు రిటైర్డ్ పెన్షనర్లు చెబుతూనే ఉన్నారు.ఈ ప్రభుత్వాన్ని వదిలించుకోవాలని వారు కంకణం కట్టుకుని మరీ పనిచేశారు. ఇక ప్రతీ నెలా జీతాలు కూడా అందని పరిస్థితి వైసీపీ ఏలుబడిలో ఉందని అప్పట్లో ఉద్యోగులు అంతా తీవ్రంగా వేదన చెందారు అని అంటారు. అంతే కాదు తనకు ఏ రకమైన ఆర్థిక ప్రయోజనాలు కానీ డీఏలు కానీ ఇతరత్రా కానీ దక్కలేదని అంటారు. ప్రత్యేకించి సీపీఎస్ రద్దు చేయలేదన్న తీవ్ర ఆగ్రహం వారిలో ఉంది. అది హామీ ఇచ్చి వమ్ము చేశారు అని అంటారు.అయితే కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతీ నెలా జీతాలు పడుతున్నాయి. ఇది వారికి ఒక విధంగా మేలు జరిగేలా ఉంది. అయితే కొత్త పీఆర్ సీ కోసం వారు అడుగుతున్నారు. ఈసారి 40 శాతం ఫిట్ మెంట్ అయినా ఉండాలని భావిస్తున్నారు. వాయిదా వేసిన కరవు భత్యాన్ని పూర్తిగా విడుదల చేయాలని ప్రతీ ఆరు నెలలూ ఠంచనుగా డీఏలను ఇవ్వాలని కోరుతున్నారు.అలాగే తమకు అన్ని విధాలుగా ప్రయోజనకరమైన తీరులో హామీలు తీర్చాలని వారు అంటున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గర అవుతున్నా కొత్త పీఆర్సీ కోసం కమిటీని ఏర్పాటు చేయలేదు. అలాగే ఆర్థిక ప్రయోజనాలు కూడా పెద్దగా లేవు. దాంతో వారిలో కొంత మేర అసంతృప్తి ఉంది అని అంటున్నారు.అంత మాత్రం చేత వైసీపీ మీద ప్రేమ కానీ మొగ్గు కానీ లేదని కూడా చెబుతున్నారు. అయితే వైసీపీలో చేరిన వారు అంతా గతంలో ఆ ప్రభుత్వం ఉన్నపుడు అనుకూలంగా చేసిన వారే అని అంటున్నారు. అందువల్ల వారు అలా మాట్లాడుతున్నారని చెబుతున్నారు. చూడాలి మరి వైసీపీలో చేరిన ఈ మాజీ సర్కార్ ఉద్యోగులు ఏ రకమైన మార్పు తీసుకుని వస్తారో.

# అఖిల పక్షం.. ఒకటే స్వరం!



న్యూఢిల్లీ,గుర్తుండే ఉంటుంది, గతంలో భారత సైనికులు గుట్టు చప్పుడు కాకుండా పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకుపోయి అక్కడి ఉగ్ర స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిన సమయంలో ప్రతిపక్షాలు ఎలా స్పందించింది గుర్తుండే ఉంటుంది. సర్జికల్ స్ట్రైక్స్ పై అనుమానాలు వ్యక్తం చేశాయి. ఆధారాలు చూపమని డిమాండ్ చేశాయి. అంతే కాదు. ముఖ్యంగా పుల్వామా బాంబు దాడికి ప్రతీకారంగా మన సైనికులు బాలాకోట్ పై జరిపిన వైమానిక దాడుల విషయంలో అధికార, విపక్షాల మధ్య యుద్ధాన్ని తలపించే విధంగా మాటల తూటాలు పేలాయి. చివరకు అధికార, విపక్ష పార్టీలు పుల్వామా ఉగ్రదాడిని ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు జరిపిన మెరుపు దాడి అంశాన్నిఎన్నికల అస్త్రం చేసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ సారధ్యంలో ప్రతిపక్ష పార్టీలు అధికార బీజేపీ పుల్వామా బాంబు దాడిలో మరణించిన సాయుధ దళాల త్యాగాలను రాజకీయం చేస్తున్నదనీ, ఎన్నికల ప్రయోజనానికి ఉపయోగించుకుంటోందనీ ఆరోపించాయి. అలాగే ఆ తర్వాత బాలాకోట్ వైమానిక దాడులకు సంబంధించి అధికార విపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలాయి. బాలాకోట్‌లో వైమానిక దాడులతో పాకిస్తాన్‌కు జరిగిన నష్టానికి సంబంధించి ప్రధాని మోదీ ప్రభుత్వం ఆధారాలు చూపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇదనే కాదు.. 2016లో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద స్థావరాలపై మోదీ ప్రభుత్వం నిర్వహించిన సర్జికల్ స్ట్రైక్స్ మొదలు ఉద్రిక్తల నడుమ భారత పభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని,ప్రతి చర్యను విపక్షాలు విమర్శిస్తూనే వచ్చాయి. నిజానికి కార్గిల్ యుద్ధం సమయంలోనూ కాంగ్రెస్ పార్టీ. అటల్ బిహారీ వాజ్ పేయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన పాక్ అనుకూల వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించాయనీ, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికీ బీజేపీ విజయానికి అదీ ఒక కారణంగా, విశ్లేషణలు వినిపించాయి. నిజానికి భారత్, పాక్ శత్రు–మిత్ర సంబంధాల విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉత్తర దక్షిణ ధృవాల మధ్య ఉన్నంత వ్యత్యాసం వుంది. అయితే, గతం ఎలా ఉన్నప్పటికీ పహల్గాం ఉగ్రదాడి విషయంలో.. అలాగే ఉగ్రదాడికి ప్రతికారంగా భారత సైన్యం, భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రతిపక్ష పార్టీలు అన్నీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దదు ప్రకటించాయి. సరే మధ్య మధ్యలో చిన్న చిన్న పొరపొచ్చాలొచ్చినా గురువారం (మే8) ఆపరేషన్ సిందూర్ సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు చెక్కుచెదరని ఐక్యతను ప్రదర్శించాయి. భారత దేశం ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించదని, మరో మారు, ప్రపంచానికి స్పష్టం చేసింది. గత నెల 22న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు, జరిపిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సేనలు ఆపరేషన్ సిందూర్ పేరిట గట్టిగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. మన భద్రతా బలగాలు మంగళవారం ( మే 6) అర్ధరాత్రి దాటాక అత్యంత కచ్చితత్వంతో ఉగ్ర స్థావరాలపై దాడి చేసి 100 మందికి పైగా ఉగ్ర వాదులను మట్టు పెట్టడం పట్ల దేశమంతా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ గురించి వివరించేందుకు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సమావేశం అనతరం మీడియాతో క్లుప్తంగా మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రతిపక్షాలన్నీ ప్రభుత్వానికి అండగా ఉన్నాయని అన్నారు. అలాగే, ఉగ్రవాద నిర్మూలన విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయానికి, ప్రతి చర్యకు ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు పరిస్థితిని అర్థం చేసుకుని పరిణతిని చూపారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారని అన్నారు. ఇతర విషయాలు, విద్వాలు ఎలా ఉన్నా,దేశ భద్రత, ఉగ్రవాద సమస్య వంటి విషయాల్లో రాజకీయాలకు తావులేదని, అధికార, ప్రతి పక్ష నాయకులు ముక్త కంఠంతో ఒకటే స్వరాన్ని వినిపించారు.

# పారిపోయిన పాక్ ప్రధాని? ఇస్లామాబాద్ నివాసం దగ్గర ఏం జరిగింది?

ఇస్లామాబాద్:చేతులారా నాశనాన్ని కొని తెచ్చుకోవటం ఎలా ఉంటుందో ప్రపంచానికి తన తీరుతో అర్థమయ్యేలా చేశారు పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ ఫరీష్. గురువారం రాత్రి భారత్ లోని సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ దాడులతో పాటు వైమానిక దాడులకు తెగబడిన పాకిస్తాన్ కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పాక్ దాడుల్ని భారత ఆర్మీ సమర్థంగా తిప్పి కొట్టటమే కాదు.. పాక్ కు భారీ నష్టం వాటిల్లేలా చేసింది.ఓవైపు తన మీద జరిగే దాడుల్ని తిప్పి కొట్టి.. నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్న భారత్.. అదే సమయంలో పాక్ పీచమణిచేలా ఆ దేశంలోని పలు ప్రాంతాల్ని టార్గెట్ చేసింది. అందులో పాకిస్తాన్ ప్రధానమంత్రి నివాసం ఉండే ఇస్లామాబాద్ మీదా దాడి చేసింది. అనూహ్య రీతిలో పాకిస్తాన్ ప్రధానమంత్రి నివాస స్థలానికి కాస్త దూరంలో భారత సైన్యం జరిపిన దాడికి పాక్ ప్రధానమంత్రితో సహా.. పాక్ సైన్యం ఉలిక్కిపడింది.ఇస్లామాబాద్ లక్ష్యంగా భారత డ్రోన్లు.. మిస్సైల్ లతో దాడికి దిగింది. దీంతో ఒక్కసారిగా అలెర్టు అయిన పాకిస్తాన్.. తన ప్రధానమంత్రిని ఇంటి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లుగా చెబుతున్నారు. యుద్ధాన్ని తనకు తానుగా ఆహ్వానించి.. తీరా తన ముంగిట్లోకి వచ్చిన వేళ.. ఇంటి నుంచి పారిపోయిన పాక్ ప్రధాని.. సురక్షిత ప్రాంతంలో తలదాచుకున్నట్లుగా చెబుతున్నారు.మరోవైపు ఇండియన్ ఎయిర్ ఫోర్సుకు దన్నుగా నిలిచేలా భారత నౌకాదళం పాకిస్థాన్ అర్థిక రాజధాని కరాచీ సముద్ర పోర్టుపై ప్రతీకార దాడులకు



పాల్పడింది. ఐఎన్ఎస్ విక్రాంత నుంచి మిస్సైల్స్.. డ్రోన్లను ప్రయోగించింది. ఈ క్రమంలో పోర్టులో ఏడు భారీ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. దీంతో.. భారీగా మంటలు ఎగిసిపడిన పరిస్థితి. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం కరాచీపోర్టులో మొత్తం పది పాక్ కార్గో నౌకలు ధ్వంసమైనట్లుగా చెబుతున్నారు. అంతేకాదు.. పలు షిప్పులు కూడా ధ్వంసమయ్యాయని.. అరేబియా సముద్రంలో పాక్ వైపు గురి పెట్టిన భారత నావికాదళం మొత్తంగా 26 యుద్ధ నౌకలతో విరుచుకుపడుతూ దాయాదిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

# వీరయ్య చౌదరి హత్య కేసు ఏమైంది?



ఒంగోలు:ఒంగోలు టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య జరిగి దాదాపు మూడు వారాలవుతోంది. ఇంత వరకూ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు సన్నిహితంగా మెలిగే వీరయ్య హత్య చౌదరిని చంపితేనే, ఇంత వరకూ దిక్కులేకపోతే, ఇక సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.వీరయ్య చౌదరికి టీడీపీకి ఎంతటి వీరాభిమానో చెప్పే వాళ్లే తప్ప, ఆయన్ను భౌతికంగా అంతమొందించిన నిందితుల అంతు చూడడంలో నాన్చివేత ధోరణి కనిపిస్తోందని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. వీళ్లే సూత్రధారులు, వాళ్లే పాత్రధారులంటూ ప్రభుత్వ అనుకూల మీడియా రోజుకో రకమైన కథనాన్ని జిల్లా పేజీల్లో వండి వారుస్తున్నాయి. పలు రకాల అనుమానితుల గురించి తమదైన రీతిలో వండివార్చారు.కానీ వాళ్లెవరినీ ఇంత వరకూ అరెస్ట్ చేయలేదు. అసలు వీరయ్య చౌదరి హత్య కేసులో ఇంత వరకూ విచారణలో పురోగతి ఏంటో సంబంధిత అధికారులు చెప్పకపోవడం గమనార్హం. ఇదిగో ఈ రోజు, రేపు అంటూ విచారణాధికారులు చెప్పడమే తప్ప, అసలు హత్యకు దారి తీసిన పరిస్థితులేంటి? ఎవరు చేయించారనే వివరాలు వెల్లడి కాలేదు.హత్య వివరాలను బయట పెడితే ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తుందనే వాదన కూడా లేకపోలేదు. ల్యాండ్, శ్యాండ్, లిక్కర్ మాఫియాల్లో వీరయ్య చౌదరి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ వుంది. అందుకే వీరయ్య చౌదరి హత్య కేసు విషయంలో ప్రభుత్వం జాగ్రత్తగా అడుగులు వేస్తోందన్న చర్చ కూడా లేకపోలేదు. ఏది ఏమైనా టీడీపీ అధికారంలో వుండగా, ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకుడు హత్యకు గురి కావడం, నిందితుల్ని ఇంత వరకూ పట్టుకోకపోవడం పోలీస్ వ్యవస్థ ప్రతిష్టకే మచ్చ అని కూటమి నేతలు అంటున్నారు.

# తిరుమలలో కలకలం.. శ్రీవారి ఆలయం మీదుగా ఐదు విమానాలు..!



తిరుమల: తిరుమలలో మరోసారి కలకలం రేగింది.. ఇవాళ ఉదయం నుంచి శ్రీవారి ఆలయం మీదుగా ఐదు విమానాలు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది..ప్రతి నిత్యం తిరుమల కొండ పై ఆలయానికి సమీపంలో తరుచూ విమానాలు వెళుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు భక్తులు.. ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటువంటి రాకపోకలు సాగకూడదు.. దీనిపై టీటీడీ ఆగమ పండితులు ప్రతీసారి చెబుతా వస్తున్నారు.. కానీ, తిరుమల కొండ గగన తళంలో తరుచూ విమానాలు వెళ్తున్నాయి.. తిరుమలను నో ఫ్లైజోన్ గా ప్రకటించాలన్న తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విజ్ఞప్తిని విమానయాన శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.. గతంలోనూ శ్రీవారి ఆలయం మీదుగా విమానాలు ఎగదరంపై భక్తులు ఆందోళన వ్యక్తంచూస్తూనే ఉన్నారు.. కానీ, తరచూ.. ఇది రిపీట్ అవుతూనే ఉంది.. మరోవైపు.. శ్రీవారి ఆలయంపై డ్రోన్లు ఎగరడం, వాటిని టీటీడీ విజిలెన్ స్వాధీనం చేసుకోవడం.. కొన్నిసార్లు కేసులు నమోదైన విషయం విదితమే.. అయితే, ఈ రోజు ఉదయం నుంచి ఏకంగా ఐదు విమానాలు శ్రీవారి ఆలయం పరిసర ప్రాంతాల మీదుగా వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు భక్తులు..

### అప్రమత్తం అయిన రక్షణ దళాలు

న్యూఢిల్లీ,భారత్– పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. తాజాగా జమ్మూ లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లతో దాడులకు యత్నిస్తున్నట్లు– జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. జమ్మూలోని ఓ ఎయిర్ స్ట్రిప్‌ను పాక్ లక్ష్యంగా చేసుకున్నట్లు– తెలుస్తోంది. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు భారీఎత్తున కాల్పులకు తెగబడుతున్నట్లు– సమాచారం.

# ఆ దళిత ఎమ్మెల్యేను పక్కన పెట్టిన టీడీపీ!


తిరుపతి: తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో సిటింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ అధిష్టానం పక్కన పెట్టింది. ఆదిమూలం భయపడ్డట్టే జరిగింది. ఆ నియోజకవర్గంలో మంత్రి లోకేశ్ రెండు రోజుల పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా సత్యవేడు టీడీపీలో విభేదాల తొలగింపుపై సర్వత్రా చర్చ జరిగింది. తెలుగు మహిళా నాయకురాలి విషయంలో కోనేటి ఆదిమూలంపై ఏడు నెలల క్రితం సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే.సత్యవేడు ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు, ఆ తర్వాత న్యాయస్థానంలో రాజీ తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. కానీ కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు మాత్రం ఎత్తివేయకపోవడం గమనార్హం. మరోవైపు ఆదిమూలంపై భారీస్థాయిలో అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. మహిళల విషయంలోనూ, అలాగే పార్టీ కేడర్‌ను అసలు పట్టించుకోలేదని, ఆయన్ను పక్కన పెట్టాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి.ఈ పరిస్థితిలో సత్యవేడులో లోకేశ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యేను పక్కన పెట్టడం గమనార్హం. లోకేశ్ మాట్లాడుతూ సత్యవేడు టీడీపీలో సమస్యలన్నీ తనకు తెలుసన్నారు. అందుకే ఇద్దరు పరిశీలకుల్ని నియమించామన్నారు. ఏవైనా సమస్యలుంటే, వాళ్లతో చర్చించి, పరిష్కరించుకోవాలని లోకేశ్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ఇంకా అవసరమైతే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఉన్నారని, ఆయనతో సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. అందరూ



అలకలు వీడి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన హితబోధ చేశారు.దీంతో సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలాన్ని అధిష్టానం పక్కన పెట్టిందన్న సంకేతాలు శ్రేణుల్లోకి వెళ్లాయి. పేరుకే ఎమ్మెల్యే తప్ప, ఆయనకు ఏ మాత్రం విలువ లేదని స్పష్టత వచ్చింది. అందుకే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయలేదనే స్పష్టత వచ్చింది. టీడీపీ అధిష్టానం పక్కన పెట్టిన రెండో దళిత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం. మొదటి ఎమ్మెల్యే తిరువూరు నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కొలికపూడి శ్రీనివాస్. అక్కడ కూడా ఇదే పరిస్థితే.

# భారత్, పాక్ యుద్ధం.. అమెరికా మద్ధతుపై జెడి వాన్స్ క్లారిటీ

న్యూఢిల్లీ,'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసింది. ఈ క్రమంలో భారత్, పాకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, వాన్స్ మాట్లాడుతూ.. నన్ ఆఫ్ అవర్ బిజినెస్ (అది ప్రాథమికంగా మాకు సంబంధించినది కాదు) అని అన్నారు.ఈ రెండు దేశాలను తాము నియంత్రించలేమని జెడి వాన్స్ అన్నారు. ఇరుదేశాలు దాడులకు పాల్పడుతున్నాయని తెలిపారు. రెండు అణుశక్తి దేశాల మధ్య ఇలాంటి ఘర్షణలు అందరికీ ఆందోళనకరమేనని అమెరికా ఉపాధ్యక్షుడు అన్నారు. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలు తగ్గాలని తాము కూడా ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. సాధరణ ప్రజలకు నష్టం జరగకుండా చూడాలని తాము కోరుతున్నామని చెప్పారు. ఇండియా, పాకిస్థాన్ యుద్ధంలో అమెరికా కలుగజేసుకోదని క్లారిటీ ఇచ్చారు. తమ సైన్యం ఎవరికి సాయం చేయదని ప్రకటించారు. ఆపై అటు భారత్‌కు గాని పాకిస్థాన్‌కు గాని యుద్ధం ఆపమని



చెప్పలేమన్నారు. అలా అని అణ్వాయుధాల ఉపయోగం ఎట్టిపరిస్థితిల్లోనూ జరగదని ఆయన తేల్చి చెప్పారు.

# పాకిస్తాన్ పైలట్ పట్టివేత...



జమ్ము కశ్మీర్: పాకిస్తాన్ కు చెందిన ఒక పైలట్ భారత ఆర్మీకి చిక్కినట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ కు చెందిన ఎఫ్ 16 ఫైటర్ జెట్ పైలట్ ను ఇండియన్ ఆర్మీ సజీవంగా పట్టుకున్నట్లు సమాచారం. రాజస్తాన్ జైసల్మేర్ లో అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఎఫ్ 16 ఫైటర్ జెట్ ను మన సుదర్శన్ కూల్చి వేసిన క్రమం లో ఆ పైలెట్ అందులోంచి ఎగ్జిట్ అయ్యాడు. అయితే అతడు మన భూభాగం లో ల్యాండ్ కావడం తో ఆర్మీ అతడిని అదుపులోకి తీసుకుందికాగా, మిస్సైల్స్, డ్రోన్లతో పాకిస్తాన్ భారత్ పై దాడికి దిగిన సంగతి తెలిసిందే. వెంటనే అలర్ట్ అయిన భారత ఆర్మీ పాక్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టింది. అంతేకాదు ప్రతీకార దాడులకు దాగింది. పాకిస్తాన్ లోకి చొచ్చుకెళ్లి మరీ బాంబుల వర్షం కురిపిస్తోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com